# నా మనసంతా నువ్వే!

-- వెంపటి హేమ

"రండమ్మా టాక్సీ వచ్చింది" అంటూ పేక్ చేసి వున్న పెట్టెల్ని తీసుకుని నడిచాడు రంగయ్య. అతని వెనకే ఇంటికి తాళం పెట్టి తానూ బయలుదేరింది తన్వి.

పెట్టెలు డిక్కీలో వుంచుతూ సణుక్కున్నాడు రంగయ్య, "ఈ అబ్బురాల బిడ్డలంతా ఇంతే ! చీమంత తేడా వస్తే చాలు, ఇట్టే అలిగి పుట్టింటికి చక్కాబోతారు. సర్దుకోరు దేనికీ.

మెట్లు దిగుతుంటే ఆపలేని దుఃఖంతో కళ్ళు చెరువులయ్యాయి తన్వికి. కన్నీళ్ళతో కళ్ళు మసకలయ్యాయి. తెరచివున్న తలుపులోంచి కారు వెనక సీట్లో చేరి కూర్చుంది. కారు కదిలింది. సీటుకు చేరగిలి కళ్ళు మూసుకుని స్థిమితపడాలని ప్రయత్నించింది తన్వి. కానీ మనసులో చెలరేగుతున్న ఆలోచనల ప్రభంజనాన్ని నిగ్రహించలేకపోయింది.

విద్యాసాగర్‌ని తానెంతో ఇష్టపడి, ఎంతో కష్టం మీద పెద్దవాళ్ళని ఒప్పించి పెళ్ళాడింది. తల్లితండ్రులు చిన్నతనంలోనే పోడంతో సరైన పెంపకం లేదనీ, చదువైతే బాగానే వుందిగాని, పైసా ఆస్థైనా లేదనీ, మరీ మెతకవాడనీ ఇలా ఏవేవో సవాలక్ష లోపాలు ఎత్తి చూపించారు. కానీ తాను మొండిగా పట్టుపట్టి నెగ్గించుకుంది. ఇప్పుడనిపిస్తోంది, పెద్దవాళ్ళ మాటలు పట్టించుకోక తప్పు చేశానని. కాని చేతులు కాలాక ఆకులు పట్టుకొని ఏం లాభం ! "బుద్ధిః కర్మానుసారిణి" అని సరి పెట్టుకోవాలి, ఖర్మ! అనుకుంది తన్వి దుఃఖంతో.

"డబ్బు తక్కువైతే ఫరవాలేదు. ఎలాగో సర్దుకు బ్రతకొచ్చు. తనంటే అస్సలు ప్రేమే లేకపోతే ఎలాగ సరిపెట్టుకోడం! 'కాంప్‌కి' అంటూ వెళ్ళి వారమయ్యింది. ఒక్క ఫోన్ కాల్ గానీ, ఒక ఉత్తరమ్ముక్క గాని అతని దగ్గరనుండి వస్తే ఒట్టు! అక్కడ అంత ఒళ్ళు మరచి పోయేటంత రాచకార్యం ఏముందో, కట్టుకున్న పెళ్ళాన్ని మర్చిపోడానికి! అంతా నిర్లక్ష్యం. తనంటే ఇంత పిసరు విలువైనా లేదు" అనుకుంది తన్వి. ఉప్పెనలా పొంగింది దుఃఖం. పరిసరాలను మర్చిపోయి, పైట కొంగు ముఖాన కప్పుకుని వెక్కివెక్కి ఏడ్చింది ఆమె.

సడెన్ బ్రేకుతో కారు ఆగింది. ఆ కుదుపుకి తెలివి తెచ్చుకున్న తన్వి కళ్ళు విప్పి నాల్గువైపులా పరికించి చూసింది. ఆ పరిసరాలు ఆమెకు కొత్తగా కనిపించాయి. తాను టాక్సీని మాట్లాడింది రైలు స్టేషనుకి! కాని స్టేషన్ కెళ్ళే దారిలో సముద్రం రాదు. ఇప్పుడు ఈ టాక్సీ నడుస్తున్నది బీచ్ పక్క రోడ్డుమీద! అంటే- ఈ టాక్సీ డ్రైవర్ తనని రూట్ మార్చి ఎక్కడికో తీసుకు పోతు న్నాడన్నమాట! రోడ్డు చూస్తే నిర్మానుష్యం. కంగారుగా తలుపు తీసుకుని కారులోంచి దిగేసింది తన్వి. ఆమెకు భయంతో చెమటలు పోశాయి. డ్రైవర్ కూడా కారు దిగి తనవైపుకే వస్తూండటం చూసేసరికి వెన్నులోంచి ఒణుకు పుట్టింది ఆమెకు. కళ్ళు శ్రావణమేఘాలే అయ్యాయి.

అంతలో కారు చుట్టి రెండడుగుల్లో ఆమెవైపుగా వచ్చిన ఆ కారు డ్రైవరు రెండు చేతులూ తన బుజాలమీద వేసి ఆమెను చేరదీసుకునే ప్రయత్నం చేశాడు. "కెవ్వు" మని పెద్ద కేకవేసి, శక్తినంతా కూడదీసుకుని అతన్ని నెట్టేసింది తన్వి.

"తన్వీ ! డార్లింగ్ ! నేనే, భయపడుతున్నావెందుకు?"

ఆ గొంతు తన భర్త సాగర్‌ది గా గుర్తించి ఆశ్చర్యపోయింది తన్వి. డ్రైవర్ స్థానంలోకి తన భర్త ఎలా వచ్చాడో తెలియక కళ్ళువిప్పి తెల్లబోయి చూసింది. "తన్వీ! నన్ను క్షమించు. రంగన్న నాకంతా చెప్పాడు. నా మట్టిబుర్రకి ఇలా జరుగుతుందన్న ఆలోచనే రాలేదు. వట్టి వన్ ట్రాక్ మైండ్" అంటూ తన్వి చేతులు అందుకొని గగ్గోలుగా ఆమెను బ్రతిమాల సాగాడు సాగర్.

చెమ్మగిల్లిన కళ్ళతో, అపరాధభావనతో విన్ననైన ముఖంతో తన చేతులు పట్టుకుని దీనంగా, ఎలుగురాపిన స్వరంతో పరిపరివిధాలుగా మాట్లాడుతూ తనని మంచి చేసుకోవాలని చూస్తున్న సాగర్ తాపత్రయాన్ని చూడగానే తన్వి కోపం నీరుగారిపోయింది.

అయినా ఆమె అతని షర్టు కాలరు పట్టుకుని గుంజుతూ "ఇన్నాళ్ళకి గుర్తొచ్చానా నేను?" అని నిలదీసి అడిగింది.

"గుర్తు రావడమా ! నేనసలు నిన్ను మర్చిపోతే కదా! ఎల్లవేళలా నామనసంతా నువ్వే. నిజంగానే నేనొక పప్పుసుద్దని. లోకజ్ఞానం తక్కువ. మీ అన్నయ్య చెప్పాడు-నీకు సర్ ప్రైజ్ గిఫ్టులంటే ఇష్టమని! నేను నీకోక 'సర్ ప్రైజు గిఫ్టు' ఇవ్వాలని ప్లాన్ చేశా. దాని ఫలితమే ఇది. నా సైలెన్స్ నిన్నింత బాధపెడుతుందని నేను

ఊహించలేకపోయాను." అంటూ సాగర్ భార్యను గుండెలకు హత్తుకుని, చేరుమాలతో ఆమె కళ్ళు ఒత్తి ఓదార్చాలని చూశాడు. కారు రోడ్డువార పార్కు చేసి, ఇద్దరూ వెళ్ళి బీచిలో ఇసకలో కూర్చున్నారు. నిర్జనమైన ఆ బీచ్ లో ఎగిసిపడుతున్న కెరటాల హోరు, ఆ కెరటాలపై తేలుతూ చేపల్ని వేటాడే నీటిపక్షుల కువకువలు తప్ప మరే శబ్దం లేదు. సాగర్ ఈ వారం రోజుల్లో గడచిన చరిత్ర చెప్పసాగాడు. అతని ఒడిలో తలవుంచి ఇసుకలో పడుకుని వినసాగింది తన్వి.

"నన్ను క్షమించగలవా తన్వీ? నువ్వు నాకు ఏ శిక్ష వేసినా తప్పు లేదు. కానీ ముందు నేను చెప్పేదంతా విను. ఆ తరువాత నీకు తోచిన శిక్ష అమలు జరుపు నాలో తప్పు ఉందనిపిస్తే-

మీ అన్నయ్య నాక్లాస్ మేట్ కావడంతో నేనొకసారి మీఇంటికి రావడం జరిగింది. ఆ రోజు నువ్వు కన్పించావు. తొలిచూపులోనే నా మనసుని దోచుకున్నావు. కానీ ఆ మాట పైకి చెప్పలేకపోయా. నేను నీకు ఏమాత్రం తగనివాడనని నానమ్మకం. అందని ఆకాశంలోని చందమామని కావాలనుకోవడం దురాశ అవుతుంది- అని మనసు సరిపెట్టుకోవడానికి ప్రయత్నించేవాణ్ణి. కాని నీ కోరిక మేరకు మన పెళ్ళి జరిగింది. "అదృష్టం వరించింది" అని సంబరపడిపోగానే సరిపోతుందా? దానిని నిలబెట్టుకోవాలంటే చాలా కృషి కావాలి. కలిగినింట పుట్టి ఎంతో ముద్దుగా పెరిగినదానివి నువ్వు. "కూర్చుండ మాఇంట కురిసీలు లేవు, నాప్రణయాంకమే నీకై పరచనుంటి" అని చెప్పి ఎన్నాళ్ళు నిన్ను సంతోషపెట్టగలను చెప్పు? అందుకే వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృషి చేశా. నేను జాబులో చేరినప్పుడే చెప్పారు, నేను నాలెడ్జ్ ఇంప్రూవ్ చేసుకుంటే నాకు స్టేటస్ పెరుగుతుంది, కారు కూడా ఇస్తాము అని. అదంతా నీకు సర్ ప్రైజ్ కావాలని అప్పుడు నీతో చెప్పలేదు. పరీక్షలకు చదువు కూడా నువ్వు నిద్రపోయాక లేచి చదివేవాడిని. ఢిల్లీనుండి నీకు ఫోన్ చేసి మాట్లాడాలన్నా భయమే, ఎక్కడ గుట్టు బయటపెట్టి సర్‌ప్రైజ్ పోగొట్టేస్తానోనని. ఈ కారుతో నీ ఎదురుగా నిలబడి, ఇది మన కారే అని చెప్పినప్పుడు, సర్‌ప్రైజ్ తో నీ ముఖంలో కదలే భావాలను కళ్ళారా చూడాలని ఆశపడ్డా. ప్చ్!" నిట్టూర్చాడు సాగర్.

ఇప్పుడు సిగ్గుతో తలదించుకోవడం తన్వి వంతయ్యింది. తలవంచుకుని "సారీ" అంది.

"నిజానికి నువ్వొకలా బాధపడితే నేనొకలా బాధపడ్డాను. చెల్లుకిచెల్లు అనుకో. నేను ఎంతో ఆశగా గుమ్మంలో అడుగు పెట్టేసరికి టాక్సీకోసం గుమ్మంలో నుంచున్న రంగయ్య కనిపించి అంతా చెప్పాడు. అంతలో టాక్సీ వచ్చింది. నేను రంగన్నని సామాను తెమ్మని టాక్సీవాణ్ణి పంపించేసి ఆ స్థానంలో నేను నిలబడ్డా. చలిగావుందని మంకీ టోపీ కొనుక్కున్నా ఢిల్లీలో. దాన్ని తీసి తలకు పెట్టుకున్నా. రంగన్న నన్ను అనవాలు పట్టలేదు. టాక్సీవాలా అనుకున్నాడు. నువ్వేమో మంచి టెంపర్ మీద ఉన్నావేమో, నువ్వూ డ్రైవర్ ఎవరన్నది పట్టించుకోకుండానే కారు ఎక్కి కూర్చున్నావు! నిన్ను పల్లవి రిసార్ట్ కి తీసికెళ్ళి ఈ రోజు అక్కడే గడపాలని, నీ అలక తీర్చి ఆతర్వాతే ఇంటికి తిరిగి రావచ్చనీ, రూటు మార్చి ఇటు తీసుకువచ్చా. కానీ, నువ్వది కూడా గమనించలేదు. నీ దుఃఖంలో నువ్వు మునిగి వున్నావు. నువ్వలా ఎక్కిఎక్కి ఏడుస్తుంటే ఇక భరించలేక కారుకి బ్రేకు వేశా. అప్పుడు నువ్వు ప్రస్తుతంలోకి వచ్చావు. ఆ తర్వాత సంగతి నీకే తెలుసు. నా తెలివితక్కువ మూలంగా నేను బాధపడి నిన్ను బాధపెట్టా. తన్వీ నేను లోకజ్ఞానం లేనివాడిని కావచ్చు కాని, చెడ్డవాడిని కాను. నామనసంతా నువ్వే! ఇక క్షమించినా శిక్షించినా నీ ఇష్టం" అంటూ తలవంచి నిలబడ్డాడు సాగర్.

తన్వి, ఆనందంతో మనసంతా నిండిపోగా, అంతవరకు పడ్డ బాధంతా మరచి పోయి లతలా అతనిని అల్లుకుపోతూ "నీ మనసు తెలియక తొందరపడ్డా. ఇక ఎప్పుడూ మనమధ్య ఇటువంటి సర్‌ప్రైజ్‌లు ఒద్దు" అంది. అతని మీద ప్రేమతో ఆమె కళ్ళు మెరిశాయి.

అప్పుడే సముద్రం మీద పైకి లేచిన పున్నమి చంద్రుని వెన్నెల వెల్లువలో సముద్రజలాలు తళతళా మెరిశాయి. ఉల్లాసం పట్టలేక ఉప్పొంగిన కెరటం నిలువెత్తున లేచి, ఒడ్డుని తాకి విరిగి పడింది. చెదిరిన ఆ తుంపురులు ఆ యువ-జంటకు తలంబ్రాలై గిలిగింతలు పెట్టగా, లేచి చెట్టాపట్టాలు వేసుకుని కారు దగ్గరకు నడిచారు వాళ్ళు ఇంటికి చేరాలన్న తొందరలో.

కార్ హారన్ విని గేటు తెరవడానికి వచ్చిన రంగయ్య నవ్వుతూ కారు దిగి చేయీ చేయీ కలుపుకుని గుమ్మాలెక్కి లోపలకు వెడుతున్న తన్వీ-విద్యసాగర్లని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఆలు మగలు మధ్య అలకలు అద్దం మీద ఆవగింజ జారినంత వేగంగా అణిగిపోవాలి. లేకపోతే ఏముంది- అంతా ప్రళయమే!" అనుకుంటూ నెరిసిన మీసాల చాటున నవ్వుకున్నాడు అనుభవజ్ఞుడైన వాచ్ మేన్ రంగయ్య.